క్లుప్తంగా

ఘనంగా వినాయక నిమజ్జనం



నున్న(విజయవాడరూరల్): నున్న లైబ్రరీ సెంటర్‌లో రాయల్ రెడ్డీస్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా భక్తులచే పూజలు అందుకున్న వినాయక నిమజ్జనం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. తీన్‌మార్ వాయిద్యాలు, రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణతో చేపట్టిన ఊరేగింపులో భారీగా మందుగుండు సామగ్రి కాల్చారు. లైబ్రరీ సెంటర్ నుంచి ఎస్సీ ఏరియా, రంగాబొమ్మ సెంటర్ మీదుగా పడమర బజారు చేరుకొని అక్కడ నుంచి పోలవరం కాల్వలో నిమజ్జనం చేశారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి

రామవరప్పాడు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది ఎకరాల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిరక్షించాలని ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ అన్నారు. రామవరప్పాడులోని ముస్లిం రైట్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులు కాపాడటానికి ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ పోరాటం చేస్తోందన్నారు. కొందరు స్వార్థపరులు పదవులు అడ్డుపెట్టుకుని వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసి కోట్ల రూపాయలు గడిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా రాష్ట్ర వక్ఫ్ ముతవల్లీల అధ్యక్షుడు ఎం.షకీల్ షఫీకు ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ తరుపున మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

పద్మలతకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందజేత



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు సాధించారు. విద్యారంగంలో పద్మలత అందించిన సేవలను గుర్తించిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్(సీఎస్సీ) ఆన్‌లైన్‌లో ఈ అవార్డును అందజేశారు. విద్యార్థినులు, వారి జీవిత ఆశయాలను నెరవేర్చేందుకు పద్మలత చేసిన కృషిని సీఎస్సీ బృందం అభినందించింది. ఆమెకు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: చోడవరం గ్రామంలో వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం చోడవరం రామాలయం సమీపంలో డి.శివరామకృష్ణ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గత ఆదివారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉంటున్న వి.రవితేజ అనే వ్యక్తి శివరామకృష్ణ ఇంట్లోకి ప్రవేశించి నిద్రపోతున్న శివరామకృష్ణ భార్యపై అసభ్యకరంగా ప్రవర్తించగా, ఆమె కేకలు వేసింది. దీంతో శిరామకృష్ణ నిద్ర లేచి రవితేజను పట్టుకునే యత్నం చేయగా అతడు పారిపోయాడు. ఈ ఘటనపై శివరామకృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మట్టి శివలింగానికి పంచామృతాభిషేకం



పెనమలూరు: పోరంకి శ్రీ గంగానమ్మ తల్లి ఆలయం వద్ద మట్టి శివలింగాన్ని భక్తులు మంగళవారం ఏర్పాటు చేశారు. చవితి ఉత్సవాలలో భాగంగా భక్తులు శివలింగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ శివలింగానికి పంచామృతాలతో ప్రత్యేకాభిషేకం చేశారు.

డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలి

నున్న(విజయవాడరూరల్): డ్రాప్ అవుట్స్ లేకుండా తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించడంలో శ్రద్ధ చూపాలని ఎస్ఎంసీ సమావేశం తీర్మానం చేసింది. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్ఎంసీ చైర్మన్ గద్దం కుమార్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. కమిటీలో సభ్యులందరూ విద్యార్థులు నూరు శాతం పాఠశాలకు వచ్చేటట్లు చూడాలని కన్వీనర్, హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి తెలిపారు. హైస్కూల్‌కు నైట్ వాచ్‌మెన్ లేనందును నియమించేందుకు ప్రభుత్వాన్ని కోరుతూ కమిటీ తీర్మానం చేసింది. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సభ్యులు గోవిందు నాగబాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో ముష్టి యుద్ధానికి దిగిన ఆటో డ్రైవర్లు

గన్నవరం: విమానాశ్రయంలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లే విషయమై ఆటో డ్రైవర్లు ఘర్షణకు దిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. విమానాశ్రయంలో క్యాబ్ సర్వీస్‌లకు సంబంధించి కాంట్రాక్ట్ ఇటీవల ముగిసింది. దీంతో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేందుకు ప్రైవేట్ కార్లు, ఆటో డ్రైవర్లు లోపలికి ప్రవేశించి ప్రయాణికుల కోసం పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులను ఎక్కించుకునే విషయమై ఇద్దరు ఆటో డ్రైవర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వీరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దిగారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ ఆవరణలోనే ముష్టి యుద్ధానికి దిగడంతో డ్రైవర్లకు గాయాలయ్యాయి. తోటి డ్రైవర్లు జోక్యం చేసుకోవడంతో వివాదం సర్దుమణిగింది. అయితే విమానాశ్రయంలో క్యాబ్, ఆటో డ్రైవర్ల మధ్య వివాదాలు పరిపాటిగా మారాయని ఎయిర్‌పోర్ట్ సిబ్బంది పేర్కొంటున్నారు.

సాయం కోసం ఎదురు చూపు

- వరద ముంపుతో వందల ఎకరాల్లో పంట నష్టం
- 300 మంది రైతులకు కష్టాలు
- కేంద్ర బృందం పర్యటన పైనే ఆశ



పెదపులిపాకలో ముంపునకు దెబ్బతిన్న వరి పైరు

పెనమలూరు: జిల్లా వ్యాప్తంగా సంభవించిన వరదలు, వర్షాలతో మండల పరిధిలో రైతులకు కన్నీళ్లు మిగిలాయి. రైతులు సాగు చేస్తున్న పంటలపై కృష్ణానది వరద ప్రళయం సృష్టించింది. వరద ముంపుతో పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. రైతులకు అందించే సాయంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే బుధవారం కేంద్ర బృందం పర్యటన ఉండటంతో రైతులు సాయం కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాలు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 12 లక్షల క్యూసెక్కుల వరద కృష్ణానదికి వచ్చింది. దీంతో నదీ పరీవాహక ప్రాంతంలో పంటలు పూర్తిగా ముంపునకు గురై దెబ్బతిన్నాయి. అలాగే కానూరు, పోరంకి, వణుకూరు, గోసాల, తాడిగడప గ్రామాల్లో అధిక వర్షాలతో డ్రెయినేజీలు సక్రమంగా లేక పంటలు ముంపునకు గురయ్యాయి. ప్రధానంగా వరి పంట 650 ఎకరాల్లో దెబ్బతింది. ఇక చెరువు, పసుపు, కంద, అరటి, కూరగాయలు, మినుము ఇలా అనేక పంటలు ముంపునకు గురవ్వటంతో 300 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు..

రైతులు అప్పులు చేసి పంటల సాగు చేపట్టారు. పలువురు రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందగా, మరి కొందరు రైతులు గ్రామాల్లో అప్పులు చేశారు. వరి ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడిపెట్టారు. పసుపు, కందకు ఎకరాకు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఇతర పంటలకు కూడా పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టి రైతులు సాగు చేస్తున్నారు. అయితే పంటలు ముంపునకు గురై దెబ్బతినటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతులకు అప్పులు మిగిలాయి. ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ ఎంత ఇస్తారనేది ప్రకటించక పోవంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

కష్టాల నుంచి గట్టెక్కించాలి..

కేంద్ర బృందం పర్యటనపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. పంటల నష్టం వాస్తవ పరిస్థితులు కేంద్ర బృందం పరిశీలించి తమకు న్యాయం చేస్తారని రైతులు భావిస్తున్నారు. పంట నష్టంపై తూతూ మంత్రంగా సాయం అందించకుండా కష్టాల నుంచి గట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమేరకు సాయం అందిస్తారోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

న్యాయం చేయాలి..



సాగు చేసిన వరి పంట పూర్తిగా దెబ్బతింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయం చేయాలి. అప్పులు కట్టలేని పరిస్థితిలో ఉన్నాం. కేంద్ర బృందం వాస్తవాలు పరిశీలించి, రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

– కరీముల్లా, రైతు, చోడవరం

పసుపు పంట దెబ్బతింది..



ఎంతో ఖర్చు చేసి సాగు చేపట్టిన పసుపు పంట వరద ముంపు కారణంగా పూర్తిగా దెబ్బతింది. అప్పులు చేసి పంట సాగు చేపట్టాను. ప్రభుత్వమే ఆదుకోవాలి. న్యాయం జరుగుతుందన్న ఆశతో ఉన్నాం.

– సీహెచ్.శ్రీనివాస్, రైతు, పెదపులిపాక

ముంపు పొలాల్లో సస్యరక్షణ చర్యలు కీలకం

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



కంకిపాడు: భారీ వర్షాలు, వరద ముంపుతో పంట పొలాలు నీట మునిగాయి. రోజులు తరబడి పొలాల్లో నీరు నిలిచిపోయింది. సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే పంటకు నష్టం వాటిల్లుతుంది. పంట సంరక్షణ చర్యలతో నష్టాన్ని అధిగమించొచ్చని సూచిస్తున్నారు ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి. వరి, చెరకు పైర్లలో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలను ఆమె 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

- కృష్ణా జిల్లాలో వర్షాలు, వరదలతో వరి, చెరకు పైర్లు ముంపు బారిన ఉన్నాయి. తెగుళ్ల వ్యాప్తికి ఆస్కారం ఎక్కువగా ఉంది. పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉండాలంటే సస్యరక్షణ చర్యలు చాలా ముఖ్యం. తద్వారా నష్టాన్ని అధికమించొచ్చు. సాగు లాభదాయకంగా మార్చుకోవటానికి యాజమాన్య చర్యలు తీసుకోవాలి.
- జిల్లాలో ప్రధానంగా వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం వరి పిలకలు వేసే దశ నుంచి చిరు పొట్ట దశలో ఉంది. సాధారణంగా వరి రకాలు నాలుగైదు రోజుల వరకూ నీటిలో మునిగినా బతికే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో వరి పంటలో అధిక నీటిని బయటకు పంపాలి. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియా, అదనంగా 20 కిలోలు పొటాష్ తప్పనిసరిగా చల్లుకోవాలి. కాంప్లెక్సు ఎరువులను ఈ దశలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు.
- ఈ పరిస్థితుల్లో బాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులును గుర్తించిన వెంటనే పొలాల్లో నీటిని మూడు సార్లు తీసివేసి, కొత్త నీరు పెట్టుకోవాలి. పొటాష్ ఎరువును ఎకరానికి 20 కిలోలు వేయాలి. తద్వారా మొక్కకు వ్యాధినిరోధక శక్తి పెరిగి తెగులు ఉధృతిని నియంత్రిచుకోవచ్చు.
- పాము పొడ తెగులు ఆశిస్తే ప్రొపికొనజోల్ మిల్లీలీటర్లు లేదా హెక్సకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఆకు ముడత పురుగు కూడా ఆశించే అవకాశం ఉంది. పురుగుఉధృతి మధ్యస్తంగా ఉంటే ఎసిపేట్ 1.5 గ్రాములు లేదా కార్టప్ హైడ్రోక్లోరైట్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి అధికంగా ఉంటే క్లోరాంట్రానిలిప్రోల్ మూడు మిల్లీలీటర్లు లేదా ఫ్లూబెండమైడ్ 0.4 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- నీట మునిగిన చెరకు పైరులో పోషకాలు లోపిస్తాయి. అధిక నీటిని తీసివేయాలి. ఎకరాకు 25 కిలోలు యూరియాతో పాటుగా 25 కిలోలు పొటాష్ వేసుకోవాలి. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టడానికి మురుగు నీటిని బయటకు పంపి కొత్త నీటిని రెండు మూడు సార్లు పెట్టుకోవాలి.



వరి క్షేత్రం వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

సబ్సిడీపై విత్తనాలకు నమోదు చేసుకోవాలి

గన్నవరంరూరల్: వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతాంగానికి వరి, మినుము, పెసర పైర్లకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని ఎంఏఓ ఎస్ఎల్ తేజస్వి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు కావాల్సిన రైతులు విత్తనం రకం తెలపాలన్నారు. ఒక్కో రైతుకు కావాల్సిన విత్తనాల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

తగ్గుముఖం పట్టిన బుడమేరు



తెన్నేరులో నిలకడగా బుడమేరు ప్రవాహం

కంకిపాడు: బుడమేరు వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. నిన్నటి వరకూ పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన బుడమేరు మంగళవారం ఉదయం నుంచి నిమ్మదించింది. ఐదు అడుగులు మేర నీరు వెనక్కి వెళ్లింది. రహదారులు క్రమేపీ నీటి ముంపు నుంచి బయటపడుతున్నాయి. పంట పొలాలు మీదుగా బుడమేరు ప్రవాహం కొనసాగుతుంది. అయితే వన్నేరు ముంపు కారణంగా ఇళ్లు మునకలోనే ఉన్నాయి. ఎగువ నుంచి వరద తగ్గటంతో బుడమేరు భారీగా తగ్గింది. కంకిపాడు - గన్నవరం రహదారిపై ఉప్పలూరు వద్ద నీటి ప్రవాహం తగ్గుతుంది. వరద నీటి ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో రహదారులు ముంపులోనే ఉన్నాయి. అయితే రహదారులపై రెండు అడుగులలోపు నీరు ప్రవహిస్తుంది. తెన్నేరు గ్రామంలో పంట పొలాలకు వెళ్లే బుడమేరు వంతెన మార్గంలో ఇంకా నీటి ప్రవాహం యథావిధిగా ఉండటంతో పంట పొలాల్లోకి వెళ్లి సంరక్షణ చర్యలు తీసుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఉధృతి మరింత తగ్గితేనే సస్యరక్షణ చర్యలకు ఆస్కారం ఉంటుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

తగ్గిన వన్నేరు..

తెన్నేరు పరిధిలో వన్నేరు ఉధృతి తగ్గింది. వన్నేరు ఉధృతితో సమీపంలోని నివాసాలు ముంపులోనే ఉన్నాయి. రోజులు తరబడి నీరు నిలిచి ఉండటంతో పరిసరాల్లో దుర్గంధం వెలువడుతోంది. ఇళ్ల చుట్టూ నిలిచిన నీటిని పక్కనే ఉన్న డ్రెయిన్లలోకి మళ్లించేందుకు స్థానికులు ప్రయత్నిస్తున్నారు.

రాకపోకలు షురూ !

ఉంగుటూరు: మండలంలో బుడమేరు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గన్నవరం - పుట్టగుంట రహదారిలో వరద ప్రవాహం తగ్గడంతో ప్రజలు ఆ మార్గంలో రాకపోకలు కొనసాగిస్తున్నారు. తేలప్రోలు - నందమూరు రహదారిలో ఉంగుటూరు వద్ద బుడమేరు వరద నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు తగ్గడానికి ఇంకా మూడు రోజులు పడుతుందని స్థానికులు చెబుతున్నారు. వరద నీరు కొంత మేరకు పంట పొలాల్లోని నీరు బయటకు వెళ్లడంతో వ్యవసాయ అధికారులు పంట పొలాల నష్టం అంచనాలు వేస్తున్నారు.

కేంద్ర బృందానికి వరద నష్టం నివేదిక అందజేస్తాం



చోడవరంలో వరదకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: జిల్లా వరదల కారణంగా జరిగిన నష్టం వివరాలపై కేంద్ర బృందానికి నివేదిక ఇస్తామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో కృష్ణానది వరదలకు దెబ్బతిన్న గృహాలను, పంట పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించటానికి కేంద్ర బృందం బుధవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తుందని చెప్పారు. నష్టంపై నివేదిక అందించి వారిని సాయం కోరతామని చెప్పారు. కలెక్టర్‌కు వరద బాధితులు, రైతులు తమ కష్టాలు తెలిపారు.

కంకిపాడులో పంట పరిశీలన..

కంకిపాడు: కృష్ణానది వరదతో ముంపు బారిన పడ్డ పంట పొలాలను కలెక్టర్ బాలాజీ మంగళవారం పరిశీలించారు. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం ప్రాంతాల్లో వరద కారణంగా నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం సర్వే జరుగుతున్న తీరుపై జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతితో సమీక్షించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, సర్పంచ్‌లు గుంటూరు శ్రీనివాసచౌదరి, కాకర్ల వెంకటరత్నం, చిప్పల రామదాసు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి, ఆర్డీవో డి.రాజు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఏఓలు కనకమేడల శైలజ, పీఎం కిరణ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు. మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో ఆర్డీఓ రాజు, తహసీల్దార్ వి.భావన్నారాయణ పంట నష్టం సర్వేను తనిఖీ చేశారు.

కేంద్ర బృందం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

గన్నవరం: కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత ముస్తాబాద వద్ద లింక్ రోడ్డు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డును కలిసే ప్రాంతంలో వరద ముంపును పరిశీలించారు. అనంతరం విమానాశ్రయానికి చేరుకున్న కలెక్టర్ టెర్మినల్ భవనంలో కేంద్ర బృందం సమావేశం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వరదలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ కోసం జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. కేంద్ర బృందం పర్యటన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. గుడివాడ రెవెన్యూ డివిజినల్ అధికారి పద్మావతి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, తహసీల్దార్ వెంకటశివయ్య, అధికారులు పాల్గొన్నారు.

వరద నష్టంపై కొనసాగుతున్న సర్వే



పెనమలూరు: కృష్ణానది వరదల కారణంగా పెదపులిపాక, యనమలకుదురు గ్రామాల్లో కరకట్ట దిగువున ఉన్న గృహాలు ముంపునకు గురై జరిగిన నష్టంపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కృష్ణచైతన్య ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. పెదపులిపాక, యనమలకుదురు ప్రాంతాల్లో గృహాలకు జరిగిన నష్టం వివరాలు సేకరిస్తున్నారు. అలాగే రేషన్‌కార్డు లేనివారి వివరాలు, నిత్యావసర సరుకులు అందని బాధితుల వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో ప్రాథమికంగా నష్టం వివరాలు సేకరించి నివేదిక రూపొందించనున్నారు.

మండలంలో 7,500 ఎకరాల్లో పంట నష్టం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న లామ్ ఫామ్ శాస్త్రవేత్తలు

ఉంగుటూరు: మండలంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, బుడమేరు వరద కారణంగా మండల వ్యాప్తంగా 7,500 ఎకరాల్లో వరి పంట నీట మునిగి దెబ్బతిందని వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్‌కుమార్ తెలిపారు. గారపాడు, ఇందుపల్లి, ఉంగుటూరు, ఎలుకపాడు గ్రామాల్లో ఏఓ మంగళవారం పర్యటించారు. మండల వ్యాప్తంగా ఉన్న 30 గ్రామాలకుగాను 23 గ్రామాల్లో వరి పంట దెబ్బతిందని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వీఏఏలు పొలాలను సందర్శించి నష్టపోయిన రైతు జాబితాలను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. సుమారు 2,800 మంది రైతులు నష్ట పోయినట్లు ప్రాథమికంగా అంచన వేశామన్నారు. చికినాల, బొకినాల, మధిరపాడు గ్రామాల్లో బొప్పాయి పంట 42 ఎకరాల్లో నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఏఈఓ దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో శాస్త్రవేత్తల పర్యటన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లి, నిడమానూరు గ్రామాల్లోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం లామ్ ఫామ్ శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఆశాజ్యోతి, శైలజా, భాస్కరరెడ్డిల బృందం దెబ్బతిన్న వరి, చెరకు పొలాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పురుగుల నివారణకు అవసరమైన మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ బి.రంగనాథ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి



చవితి ఉత్సవాల నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ వెంకటరమణ

పెనమలూరు: వినాయక నిమజ్జనం సమయంలో భక్తులు నిబంధనలు పాటించాలని సీఐ వెంకటరమణ అన్నారు. కానూరు మన కల్యాణ మండపంలో మంగళవారం వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వినాయక చవితి పండుగ ఉత్సవాలు ఘనంగా చేసుకోవటానికి తాము 145 పందిళ్లకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. అనుమతులు ఇచ్చిన సమయంలో నిబంధనలు తెలిపామన్నారు. అయి తే కొందరు నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తున్నారని తెలిపారు. డీజేలు వాడరాదని, టపాసులు కాల్చరాదని, వినాయక నిమజ్జనంలో హడావుడి చేయరాదని చెప్పామన్నారు. అయితే కొందరు నిబంధనలు అతిక్రమిస్తూ సమస్యలు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భక్తులు ఇలా వ్యవహరించటం వలన శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. దీనికి పూర్తి బాధ్యత ఉత్సవాల కమిటీలదేనన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ పాల ఫ్యాక్టరీకి రూ.లక్ష విరాళం



కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసానికి చెక్కు అందిస్తున్న పాల సొసైటీ అధ్యక్షులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వరదతో ముంపునకు గురైన విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ ప్రధాన పాల ఉత్పత్తుల కార్మాగారం మరమ్మతుల నిమిత్తం చిట్యాల, వీరవల్లి పాల సొసైటీల తరుపున రూ.లక్ష విరాళాన్ని అందించారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాజెక్టు కామధేను ఫ్యాక్టరీలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులను కలిసి రూ. లక్ష చెక్కును అందజేశారు. ముందుచూపుతో గతేడాది వీరవల్లిలో కొత్తగా అత్యాధునిక ఆటోమేషన్ సదుపాయాలతో ప్రాజెక్టు కామధేను ఫ్యాక్టరీ నిర్మించటం వల్ల ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాల సేకరణ, సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించటం చైర్మన్ చలసాని పాలనా సమర్థతకు నిదర్శనమని కొనియాడారు. చిట్యాల, వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షులు బి.సుశీల, కసుకుర్తి నిరంజనరావు, యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు పాల్గొన్నారు.

వరద ముంపులోనే జక్కులనెక్కలం

గన్నవరంరూరల్: మండలంలోని జక్కులనెక్కలం గ్రామం ఇంకా వరద ముంపులోనే ఉంది. గూడవల్లి నుంచి ఈ గ్రామానికి వెళ్లే ఏకైక రహదారిపై గూడవల్లి వద్ద బుడమేరు వంతెనపై వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు ఇప్పటికీ స్తంభించాయి. గ్రామస్తులు బయటకు వచ్చేందుకు బోటు మార్గాన్ని అనుసరిస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకులను 300లకు పైగా కుటుంబాలకు అందజేశారు. సావరగూడెం గ్రామానికి కేసరపల్లి నుంచి వెళ్లే రోడ్డు మార్గం ఇంకా పునరుద్ధరణకు నోచుకోలేదు. ఈ మార్గంలో రోడ్డుకు గండి ఏర్పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు చీమలవాగులో నీటి ప్రవాహం కొనసాగుతోంది. సావరగూడెం ఎంపీపీ స్కూల్‌లో వరద బాధితులకు పునరావాసం కల్పించారు.

స్థిరంగా వరద.. పొలాలను వీడని బురద

కంకిపాడు: కృష్ణానది ఏటిపాయలో వరద నీటి ప్రవాహం స్థిరంగా ఉంది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 3 లక్షల క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నారు. అయితే పంట పొలాల్లో మురుగు పాయలోకి చేరుకోవటంతో వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. ప్రస్తుతం మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధిలోని కృష్ణానది పాయ వద్ద ఏటి ఒడ్డును తాకుతూ వరదనీరు సముద్రంలోకి వెళ్తుంది. ఏటిపాయకు స్వల్పంగా వరద తగ్గటంతో పడవల్లో రైతులు, కూలీలు ఏటిపాయ మధ్యన ఉన్న లంక భూములకు వెళ్లి పంట పొలాల సస్యరక్షణ పనులను చేపడుతున్నారు. పొలాల్లో మురుగు, వ్యర్థాల తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. మోటర్లను బాగు చేయించి నీటి వనరులను సమకూర్చుకుంటున్నారు.

పొలాలను వదలని వరద

సాగులో ఉన్న వరి, చెరకు, పసుపు, కంద, తమలపాకు, అరటి, కూరగాయ పంటలు వరద నీటిలో మునిగాయి. 11.40 లక్షలు క్యూసెక్కులు వరద చేరటంతో పంటలు పూర్తిగా ముంపు బారినపడ్డాయి. ఎగువ నుంచి ఉధృతి కొనసాగటంతో వ్యర్థాలు కొట్టుకువచ్చి పంట పొలాల్లో పేరుకుపోయాయి. ప్రస్తుతం వరద ఉధృతి తగ్గినా పొలాల్లో మురుగు మాత్రం కదలటం లేదు. వారం రోజులు పాటు నీటిలో పంట పొలాలు మునిగి ఉండటంతో అన్ని పంటలు కుళ్లిపోతున్నాయి. అరటి తోటలు, తమలపాకు తోటలు దెబ్బతిన్నాయి. పంటలు కుళ్లి తీవ్ర దుర్గంధం వెలువడుతుండటంతో పంట సంరక్షణ పనులు సజావుగా చేసుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.



నిత్యావసర సరుకులతో లా కాలేజీ విద్యార్థులు

వరద బాధితులకు సాయం

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలతో పాటు విజయవాడ నగరంలో వరద బాధితులకు దాతలు మంగళవారం ఆపన్నహస్తం అందజేశారు. ఆహారం, వాటర్ బాటిళ్లు, మెడికల్ కిట్లు అందించారు.

– పెనమలూరు/గన్నవరం/గన్నవరంరూరల్/హనుమాన్‌జంక్షన్‌రూరల్



బాపులపాడులో భోజనం వడ్డిస్తున్న దాతలు



సావరగూడెంలో కిట్లు అందజేస్తున్న హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సిబ్బంది